స్వచ్ఛతవైపు
అడుగులు..


2


2
బీజేపీ నాయకుల
ఆందోళన

AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatoday.in

## కామారెడ్డిలో రాళ్ల వర్షం



**అక్షరటుడే, కామారెడ్డి:** కామారెడ్డిలో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. సుమారు రెండు గంటల నుంచి కామారెడ్డిలో ఈదురు గాలులు వీస్తున్నాయి. సాయంత్రం కాసేపు పట్టణంలో రాళ్ల వర్షం కురిసింది. కాగా కామారెడ్డి జిల్లాకు వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ ప్రకటించింది. గరిష్ట ఉపరితల గాలి వేగం గంటకు 40 కి.మీ కంటే తక్కువ ఉంటుందని, దాంతో తేలికపాటి ఉరుములతో కూడిన వర్షాలు వచ్చే అవకాశం ఉందని ప్రకటించింది.

16-3-2026 NIZAMABAD / KAMAREDDY PAGES - 2

## అధికారుల నిర్లక్ష్యం.. ప్రభుత్వానికి భారీగా నష్టం..

- కామారెడ్డి మున్సిపాలిటీలో ఏసీబీ సోదాలు
- దాడుల్లో సంచలన విషయాలు వెలుగులోకి..

**అక్షరటుడే, కామారెడ్డి:** కామారెడ్డి మున్సిపాలిటీలో ఏసీబీ చేపట్టిన సోదాల్లో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఉదయం 10 గంటలకు మొదలైన సోదాలు సాయంత్రం 6 గంటల వరకు కొనసాగాయి. ముఖ్యంగాసానిటేషన్, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ శాఖలపై వచ్చిన ఫిర్యాదులపై ఏసీబీ ప్రధానంగా ఫోకస్ చేసినట్టుగా తెలుస్తోంది. పట్టణంలో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు పట్టించుకోలేదన్న ఆరోపణలు ఎప్పటినుంచో వస్తున్నా అధికారుల్లో చలనం కనిపించలేదు. పైగా అక్రమ నిర్మాణాల్లో కమీషన్లు తీసుకుని అనుమతులిచ్చారన్న ఆరోపణలున్నాయి. ఏసీబీ తనిఖీల్లో కూడా ఈ విషయం స్పష్టమైంది. 2025-26లో అనధికార నిర్మాణాలపై 47 ఫిర్యాదులు వచ్చినా నోటీసులు ఇచ్చి ఎటువంటి చర్య తీసుకోలేదని ఏసీబీ తనిఖీల్లో తేలింది. పట్టణంలోని కమర్షియల్ షాపుల లైసెన్సులపై ఆరోపణలున్నాయి. 400కు పైగా వాణిజ్య షాపుల ట్రేడ్ లైసెన్స్ రెన్యువల్స్ పెండింగ్‌లో ఉన్నట్టుగా ఏసీబీ గుర్తించింది.

### ప్రభుత్వానికి రూ.కోటికి పైగా నష్టం..!

అధికారుల తీరుతో ప్రభుత్వానికి సుమారు రూ. కోటి బకాయిలు ఏర్పడ్డాయని ఏసీబీ పేర్కొంది. ప్రాపర్టీ ట్యాక్స్ అసెస్‌మెంట్లలో తేడాలు గుర్తించారు. దీనివల్ల ప్రభుత్వానికి నష్టం వాటిల్లినట్టుగా ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. మున్సిపల్ అధికారులు ఫ్యుయెల్ ఛార్జీలలో చేతివాటం ప్రదర్శించినట్టుగా తెలుస్తోంది. నెలకు రూ.12.40 లక్షలు కేటాయించినా, సరైన రికార్డులు లేవ ని గుర్తించారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల వేతనాల్లో భారీ వ్యత్యాసం బయటపడింది. కొంతమంది అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను గైర్హాజరుగా మార్క్ చేసినా పూర్తి నెల జీతం చెల్లించారు. జీతం చెల్లింపుల విషయంలో కమీషన్లకు కక్కుర్తి పడుతున్నారన్న ఆరో పణలు గతంలో వినిపించినా చర్యలు తీసుకోలేదన్న ఆరోపణలున్నాయి. భవన నిర్మాణాల అనుమతులలో జాప్యం ఉందని తనిఖీల్లో బట్టబయలయ్యాయి. డిసెంబర్ 2025 నుంచి 169 బిల్డింగ్ పర్మిషన్ దరఖాస్తుల్లో 18 ఆలస్యంగా ప్రాసెస్ అయ్యాయని తేలింది. తనిఖీల రిపోర్ట్ ప్రభుత్వానికి సమర్పించి తదుపరి చర్యలకు సిఫార్సు చేస్తామని అధికారులు తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు శుద్ధజలం అందించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఇప్పటికే సెంటర్‌లో పౌష్టికాహారం అందిస్తున్నారు. అయితే చిన్నారులు నల్లా నీరు తాగుతున్నారు. కొందరు ఇళ్ల నుంచి తెచ్చుకుంటున్నారు. ఈ క్రమంలో పిల్లల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని ఎంపిక చేసిన సెంటర్లలో ఆర్వో ప్లాంట్లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అంగన్‌వాడీల బలోపేతానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాయి. ఇటీవల ఉచిత విద్యుత్ కనెక్షన్లతో కేంద్రాల్లో వెలుగులు నింపగా.. తాజాగా శుద్ధ జలం అందించనున్నారు. - అక్షరటుడే, ఇందూరు



# అంగన్‌వాడీలకు శుద్ధ జలం



▪ ఆర్వో ప్లాంట్ల ఏర్పాటుకు నిర్ణయం ▪ సొంత భవనాలు ఉన్న కేంద్రాల్లో.. ▪ జిల్లాకు 300 యూనిట్లు మంజూరు

జిల్లాలో మొత్తం 1501 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. అయితే సాక్ష్యమ్ పథకంలో భాగంగా కేంద్రాలను ఆకర్షణీయంగా తీర్చేదిద్దేలా రంగులతో పెయింటింగ్ వేస్తారు. ఇప్పటికే పెయింటింగ్స్ వేసి ఉన్న కేంద్రాల్లో పిల్లల ఆట వస్తువులను కొనుగోలు చేయనున్నట్లు తెలిసింది. ఈ పథకానికి ఎంపికైన కేంద్రాలకు రూ.25 వేలు అందజేయనున్నారు. వీటితో శుద్ధ జల యంత్రాలను కొనుగోలు చేయడంతో, ఇతర పనులు చేపట్టనున్నారు. జిల్లాలో ఈ పథకాన్ని అమలు చేయడానికి అవసరమైన ఏర్పాట్లను అధికారులు చేస్తున్నారు. ఈ మేరకు ఆర్వో వాటర్ ప్యూరిఫైర్ యంత్రాలను సరఫరా చేసే పలు కంపెనీల నుంచి టెండర్లు పిలిచినట్లు సమాచారం.

### సొంత భవనాల్లో ఉన్నవాటికి..

జిల్లాలో నిజామాబాద్ అర్బన్, డిచ్‌పల్లి, బోధన్, ఆర్మూర్, భీమ్‌గల్ ఐసీడీఎస్ ప్రాజెక్టులున్నాయి. వీటి పరిధిలో మొత్తం 1,501 కేంద్రాలు పని చేస్తున్నాయి. వీటిలో సొంతభవనాలు, అద్దె చెల్లించాల్సిన అవసరం లేని ప్రభుత్వ, ప్రభుత్వేతర భవనాల్లో ఉన్న 300 కేంద్రాల్లో శుద్ధ జల యంత్రాలు అమర్చనున్నారు. ఇందుకోసం ఒక్కో యంత్రానికి రూ. 10 వేల వరకు వినియోగించనున్నారు. మిగిలిన నిధులతో ఎంపిక చేసిన కేంద్రాలకు పెయింటింగ్, పిల్లల ఆట వస్తువులు కొనుగోలు చేయనున్నారు.

### ఎంతో మేలు

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులతో పాటు బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం అందిస్తున్నారు. వీరు నల్లా నీరు తాగుతున్నారు. కొందరు బాటిళ్లలో ఇంటి నుంచి నీళ్లు తెచ్చుకుంటున్నారు. అయితే తాజాగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో కేంద్రాలకు వచ్చే లబ్ధిదారులకు శుద్ధ జలం అందనుంది. ప్రధానంగా ఎండాకాలం దాహార్తి తీరనుంది. వర్షాకాలంలో కలుషిత నీరు నుంచి విముక్తి పొందే అవకాశం ఉంది.



## ఫేక్ డాక్యుమెంట్లతో కబ్జాకు యత్నం..

**అక్షరటుడే, కామారెడ్డి:** ఫేక్ డాక్యుమెంట్లు సృష్టించి తనభూమి కబ్జా చేసి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి యత్నిస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కామారెడ్డి పట్టణానికి చెందిన విజయ్ కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశాడు. బాధితుడు మాట్లాడుతూ.. కామారెడ్డి పట్టణంలోని సైలానీబాబా కాలనీ లో 888 సర్వే నంబర్‌లో తనకు 7 గుంటల భూమి ఉందన్నారు. అయితే ముత్యంపేట గోపి గౌడ్ అనే వ్యక్తి తన భూమిని గతంలో విక్రయించాడని తెలిపారు. ప్రస్తుతం తనకు సంబంధించిన 888 సర్వే నంబరుపై బై నంబర్లు సృష్టించి వాటి ద్వారా ఫేక్ డాక్యుమెంట్లు తయారు చేసి అతని వదిన, కొడుకు, ఇతరుల పేరున భూమి సేల్ డీడ్ చేశాడని ఆరోపించారు. తన భూమికి సంబంధించిన ఫేక్ డాక్యుమెంట్లు సృష్టించి కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నాడని పేర్కొన్నారు. ఆ స్థలాన్ని కబ్జా చేసి అందులో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేయడానికి దరఖాస్తు చేసుకున్నాడన్నారు. తన భూమిపై ఫేక్ డాక్యుమెంట్లు సృష్టించి అక్రమాలకు పాల్పడుతున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు.

## విద్యార్థుల భవిష్యత్తులో తల్లిదండ్రుల పాత్ర కీలకం



**అక్షరటుడే, ఇందూరు:** విద్యార్థుల భవిష్యత్తులో తల్లిదండ్రుల పాత్ర కీలకమని విద్యావేత్త మేఘ సుబేదార్ తెలిపారు. నగరంలోని మారుతినగర్‌లో ఉన్న మ్యాథమన్ ప్లే స్కూల్లో మదర్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చిన్నారులు ఉదయాన్నే లేవడం, ఆహారం తీసుకోవడం, పాఠశాలకు సిద్ధం చేయడం వెనక తల్లి ప్రధాన పాత్ర పోషించాల్సి వస్తుందన్నారు. తమ చిన్నారుల ఆలోచనకు తగిన విధంగా ముందుకు సాగాలన్నారు. అలాగే ఉపాధ్యాయుల పాత్ర కూడా ఎంతో కీలకమన్నారు. అనంతరం చిన్నారుల చేసిన డ్యాన్సులు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ వేణుగోపాల్, ప్రిన్సిపల్ శ్వేత, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## మక్క కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి: అర్వింద్



**అక్షరటుడే, ఇందూరు:** నిజామాబాద్ జిల్లాలో రైతులు పండించిన మక్క పంట కొనుగోలు కోసం కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఎంపీ ధర్మపురి అర్వింద్ కోరారు. ఈ మేరకు కలెక్టర్ ఇలా త్రిపాఠి కి ఆయన లేఖ రాశారు. జిల్లాలో ఈ ఏడాది పెద్ద ఎత్తున మక్క సాగు అయ్యిందని పేర్కొన్నారు. అయితే ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంలో ఆలస్యం జరుగుతోందన్నారు. కేంద్ర ప్రభుత్వం మక్కకు కనీస మద్దతు ధర రూ.2,400 ప్రకటించినప్పటికీ, కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో రైతులు ప్రైవేట్ వ్యాపారులకు క్వింటాలుకు రూ.1,700 నుంచి రూ.1,800 వరకు తక్కువ ధరకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. తక్కువ ధరకు అమ్ముకోవడం వల్ల ప్రతి రైతు సగటున రూ.20,000 నుంచి రూ.25,000 వరకు నష్టపోతున్నారని ఎంపీ తెలిపారు. వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల నుంచి మక్కను మద్దతు ధరకు కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను ఆయన కోరారు. అలాగే రైతులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసి, మక్క కొనుగోలు ప్రక్రియను త్వరితగతిన ప్రారంభించాలని ఎంపీ అర్వింద్ ధర్మపురి సూచించారు.

## కొడుకులు పట్టించుకుంటలేరు.. ఓ తల్లి ఆవేదన.. ప్రజావాణిలో ఫిర్యాదు




**అక్షరటుడే, కామారెడ్డి:** కన్నవారు వృద్ధాప్యంలో ఉంటే వారి బాగోగులు కొడుకులే చూసుకోవాలంటారు.. కానీ నేటి సమాజంలో కొందరు కొడుకులు మాత్రం తమ తల్లిదండ్రుల పట్ల కాలయములవుతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. దోమకొండకు చెందిన 80 ఏళ్ల వృద్ధురాలికి నలుగురు కూతుళ్లు.. ఇద్దరు కొడుకులు. కూతుళ్లకు పెళ్లిళ్లయ్యాయి. ఇద్దరు కొడుకులు ఉన్నా ఉపయోగం లేకుండా పోయింది. తల్లి పేరుపై ఉన్న భూమి, ఇల్లు వాళ్ల పేరుమీద చేసుకుని ఆమెను అనాథను చేశారు. తిండి కూడా పెట్టడం లేదు. దాంతో న్యాయం కోసం కలెక్టర్ చెంతకు చేరింది. నాలుగు నెలల క్రితం అనసూయ కాలు విరగడంతో ఇబ్బందు లు పడుతోంది. కొడుకులు, కోడళ్లు పట్టించుకోవడం లేదు. కనీసం తిం డి పెట్టడంలేదు. ఈ విషయమై అధికారుల వద్దకు వెళ్తే భూములన్నీ వాళ్లకు ఇచ్చేశాక మేమేం చేస్తామని సమాధానం ఇచ్చారు. దాంతో తనకు న్యాయం చేయాలని ప్రజావాణి లో కలెక్టర్‌కు ఆ వృద్ధురాలు మొరపెట్టుకుంది.



## డాక్టర్ కవితారెడ్డిని సన్మానించిన బొబ్బిలి రామకృష్ణ

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ గవర్నింగ్ కౌన్సిల్ ఛైర్మన్‌గా డాక్టర్ కవితారెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ డీసీసీ అధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణ ఆధ్వర్యంలో ఆమెను సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రనాయకులు జగడం సుమన్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు సంపత్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రత్యేకాధికారులు క్షేత్రస్థాయిలో సందర్శించాలి

**అక్షరటుడే, ఇందూరు:** మండల ప్రత్యేక అధికారులు తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో సందర్శించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం ప్రజావాణి అనంతరం అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. బాలికల గురుకుల పాఠశాలలను సందర్శించే సమయంలో వారి ఆరోగ్యం సామాజిక సమస్యలు, మానసికమైన ఒత్తిడి తదితర అంశాలను తెలుసుకోవాలని ఆదేశించారు. బాలికల భద్రతకు ప్రాధాన్యత ఇస్తున్నారా లేదా అని పరిశీలించాలన్నారు. ఏప్రిల్ 1వ తేదీ నాటికి అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఈ-ఆఫీసులుగా మారాల్సిందేనని కలెక్టర్ స్పష్టం చేశారు. పరిపాలనాపరమైన అనుమతులు, ఆర్థిక లావాదేవీలు అన్ని ఆన్‌లైన్ విధానంలోనే జరగాలని ఆదేశించారు. అవసరమైతే ఆపరేటర్లకు శిక్షణ ఇవ్వాలని ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ కార్తీకి సూచించారు. అలాగే ఏప్రిల్ 2న జిల్లావ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీల్లో గ్రామసభలు, మున్సిపల్ పట్టణాల్లో వార్డు సభలు విధిగా నిర్వహించాలని చెప్పారు. వేసవికాలాన్ని దృష్టిలో పెట్టుకొని 8 గంటలకు సభలు ప్రారంభమయ్యేలా చూడాలని, షామియానా, తాగునీటి సదుపాయం అందుబాటులో ఉంచాలని సూచించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పంట రుణ మాఫీ, రైతు భరోసా, ఇందిరమ్మ ఇల్లు, సన్న బియ్యం పంపిణీ, కొత్త రేషన్ కార్డుల జారీ, పెన్షన్ మంజూరు, మహాలక్ష్మి పథకం అమలు తదితర వివరాలను సభల్లో వెల్లడించాలని తెలిపారు. సమావేశంలో సబ్ కలెక్టర్లు వికాస్ మహతో, అభిగ్యాన్ మాల్వియా, ఇన్‌ఛార్జి అదనపు కలెక్టర్ దిలీప్ కుమార్, డీఆర్‌డీవో సాయాగౌడ్, ఆర్డీవో రాజేంద్ర కుమార్, బోధన్ ఏసీపీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజారోగ్య పరిరక్షణకు శాయశక్తులా కృషిచేస్తా: కవితారెడ్డి



**అక్షరటుడే, నిజామబాద్ సిటీ:** ప్రజారోగ్య పరిరక్షణకు శాయశక్తులా కృషిచేస్తానని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ గవర్నింగ్ కౌన్సిల్ ఛైర్మన్ కవితారెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని ఆరోగ్య కుటుంబ సంక్షేమ సంస్థ కార్యాలయంలో ఆమె సోమవారం ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ కవితారెడ్డి మాట్లాడుతూ తనను నియమించిన సీఎం రేవంత్ రెడ్డి, రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు.. కృషి చేసిన పీసీసీ చీఫ్ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, జిల్లా ఎమ్మెల్యేలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం అందేలా కార్యాచరణ రూపొందించి ముందుకు సాగుతానని డాక్టర్ కవితారెడ్డి పేర్కొన్నారు. హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ఇన్‌స్టిట్యూట్‌ను మరింత అభివృద్ధి చేస్తానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యేలు ఆకుల లలిత, ఈరవత్రి అనిల్, ఉర్దూ అకాడమీ ఛైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, సహకార యూనియన్ ఛైర్మన్ మోహన్ రెడ్డి, మాజీ మేయర్ ధర్మపురి సంజయ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రాంభూపాల్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణ, కాంగ్రెస్ నాయకులు రత్నాకర్, రామర్తి గోపి, భక్తవత్సలం, కాకతీయ సంస్థల ఛైర్మన్ రజనీకాంత్, ఫుట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి పాల్గుణ, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి డాక్టర్ బొబ్బిలి నర్సయ్య తదితరులు కవితారెడ్డిని కలిసి పుష్పగుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
2
నిజామాబాద్/కామారెడ్డి
సోమవారం
16.3.2026
AKSHARA TODAY
www.aksharatoday.in



## రుద్రంగి గంగాధర్ గుప్తాకు సేవా రత్న అవార్డు

**అక్షరటుడే, బాన్సువాడ:** పట్టణానికి చెందిన రుద్రంగి గంగాధర్ గుప్తా సేవా రత్న అవార్డును అందుకున్నారు. హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో నిర్వహించిన శ్రీ పరాభవనామ సంవత్సర ఉగాది వేడుకల్లో భాగంగా ఆయనకు ఈ అవార్డును సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమాన్ని శ్లోక వహజాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జస్టిస్ చంద్రకుమార్, పద్మశ్రీ అవార్డు గ్రహీత కిన్నెర మొగులయ్య హాజరయ్యారు. సమాజంలో విశేష సేవలు అందించిన వారికి సేవా రత్న అవార్డులను ప్రదానం చేశారు. ఈ అవార్డుల కోసం దేశవ్యాప్తంగా మొత్తం 536 దరఖాస్తులు రాగా, వాటిలో కేవలం 25 మందిని మాత్రమే ఎంపిక చేసి అవార్డులు అందజేశారు. అందులో బాన్సువాడ పట్టణానికి చెందిన రుద్రంగి గంగాధర్ గుప్తా ఎంపిక కావడం స్థానికులకు గర్వకారణంగా నిలిచింది. ఈ సందర్భంగా ఆయనకు పలువురు అభినందనలు తెలిపారు.



## కొండగట్టుకు పాదయాత్రగా..

**అక్షరటుడే, ఆర్మూర్:** ఆలూరు మండల కేంద్రం నుంచి కొండగట్టు ఆంజనేయస్వామి దర్శనం కోసం ఆలూరు వాగడ జంబి హనుమాన్‌కు చెందిన 31 మంది స్వాములు బయలుదేరారు. 105 కి.మీ పాదయాత్రగా బయలుదేరి విజయవంతంగా కొండగట్టుకు చేరుకున్నారు. భక్తిశ్రద్ధలతో స్వామివారి నామస్మరణ చేస్తూ పాదయాత్ర కొనసాగించారు. ఈ సందర్భంగా స్వాములు మాట్లాడుతూ.. ఆంజనేయస్వామి ఆశీస్సులతో ఆలూరు నుంచి కొండగట్టుకు పాదయాత్ర విజయవంతంగా పూర్తిచేశామని, ప్రతి ఏడాది ఇదేవిధంగా భక్తిభావంతో పాదయాత్ర కొనసాగిస్తామన్నారు.





# స్వచ్ఛత వైపు అడుగులు

- ప్రతి ఆదివారం ఒక గంట నినాదంతో ముందుకు..
- ఆర్మూర్ పట్టణంలో శుభ్రత–పరిశుభ్రత
- ఆదర్శంగా నిలుస్తున్న మహాత్మ స్వచ్ఛంద సంస్థ
- 47వ వారానికి చేరిన స్వచ్ఛభారత్..

**ఆర్మూర్ పట్టణానికి చెందిన సుంకే శ్రీనివాస్ మహాత్మ స్వచ్ఛంద సేవా సంస్థను స్థాపించి ప్రతి ఆదివారం ఒక గంట అనే నినాదంతో ముందు కెళ్తున్నారు. పట్టణంలో శుభ్రత పరిశుభ్రతే లక్ష్యంగా సేవ చేస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నాడు. ప్రతి ఆదివారం స్వచ్ఛంద సంస్థ ద్వారా 15 మంది సభ్యులు పట్టణంలోని ఆయా ప్రాంతాలను ఎంపిక చేసుకుని పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.**

**– అక్షరటుడే ఆర్మూర్**

పట్టణంలోని గుడులు, బడులు, మసీదులు, చర్చిలు, వసతి గృహాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రతి ఆదివారం మహాత్మా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో స్వచ్ఛ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. అలాగే పార్కులు, పట్టణంలోని ప్రధాన కూడళ్లు, కాలనీలను ఎంచుకొని ఉదయాన్నే చీపురు, పార, కొడవలి, గొడ్డలి, తట్టలు పట్టుకొని పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని ఊడ్చేస్తున్నారు. పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలను తొలగిస్తూ పరిసరాలను శుభ్రం చేస్తూ ఆర్మూర్‌ను స్వచ్ఛత వైపు అడుగులు వేయించడంలో మహాత్మ స్వచ్ఛంద సంస్థ ప్రముఖ పాత్ర పోషిస్తోంది.

### అందరికీ ఆదర్శంగా...

సుంకే శ్రీనివాస్ ఏర్పాటు చేసిన మహాత్మ స్వచ్ఛంద సేవా సంస్థ అనతి కాలంలోనే ఆర్మూర్ పట్టణంలో మంచి గుర్తింపును సాధించింది. స్వచ్ఛత పేరుతో యువకులను ప్రజలను మమేకం చేస్తూ ప్రజలలో పరిశుభ్రత భావాన్ని పెంపొందిస్తూ పరిసరాల పరిశుభ్రత వైపు అడుగులు వేస్తున్నారు.

గత 47 వారాలుగా ఆర్మూర్ పట్టణంలోని కాలనీలు, ప్రభుత్వ కార్యాలయాలు, పార్కులు, దేవాలయాలు, బడులు, చర్చిలు, దర్గాలు, మసీదు ప్రాంగణాలు పరిసరాలను స్వచ్ఛభారత్ పేరా పరిశుభ్రం చేస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు.

### స్వచ్ఛత వైపు అడుగులు వేస్తున్నాం..



పట్టణాన్ని స్వచ్ఛ ఆర్మూర్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం. పరిసరాల పరిశుభ్రతలో ప్రతి ఒక్కరిని భాగస్వామ్యులను చేస్తూ స్వచ్ఛను సాధించడమే తమ ప్రధాన కర్తవ్యం. ప్రతి ఆదివారం ఒక గంట నినాదంతో స్వచ్ఛ కార్యక్రమం నిర్వహిస్తూ అందరికి స్ఫూర్తినిస్తూ తమ ప్రయాణం 47 వారాలకు చేరింది. ఇదే స్ఫూర్తితో ఆర్మూర్ స్వచ్ఛ పట్టణంగా నిలిచే వరకు తమ కార్యక్రమాలు కొనసాగిస్తాం.

**– సుంకే శ్రీనివాస్, మహాత్మ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకుడు**





## సీనియర్ సిటిజన్స్ ఫోరం నూతన కమిటీ ఎన్నిక

**అక్షరటుడే, ఇందూరు:** నిజామాబాద్ సీనియర్ సిటిజన్స్ ఫోరం నూతన కమిటీ ఆదివారం సాయంత్రం ఎన్నుకున్నారు. కమిటీ 2029 వరకు కొనసాగనుంది. అధ్యక్షుడిగా కె.నారాయణ రెడ్డి, కార్యదర్శిగా డాక్టర్ విజయ్‌కుమార్, కోశాధికారిగా భూమయ్య, సహాధ్యక్షుడిగా రవీంద్రనాథ్, ఉపాధ్యక్షుడిగా లింగయ్య, సంయుక్త కార్యదర్శిగా ధర్మరాజు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా గుజరాతి రాజేశ్వర్ తదితర కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా ఆశన్న, మేఘరాజ్, గంగా కిషన్, గంగాధర్ వ్యవహరించారు.



## ప్రభుత్వ ఆస్పత్రి తనిఖీ

**అక్షరటుడే, కోటగిరి :** పోతంగల్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మండల స్పెషల్ ఆఫీసర్ మున్ని సోమవారం తనిఖీ చేశారు. ఆస్పత్రిలో అందుతున్న వైద్య సేవల గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం, ల్యాబ్, మందుల నిల్వలను పరిశీలించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. నైట్ వాచ్‌మెన్, అటెండర్ పోస్టు అదనపు గదులు కావాలని సిబ్బంది కోరగా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్, కల్లూరి సంధ్య, హన్మాండ్లు, తహశీల్దార్, రంజిత్, ఎంపీడీవో చందర్, ఆర్ఐ సయ్యద్ హుస్సేన్, సర్వేయర్, పోశెట్టి, డాక్టర్లు అలీ ముద్దీన్, జయప్రకాష్, కరణ్, హెల్త్ సూపర్‌వైజర్ సుజాత, సావిత్రి, పంచాయతీ సెక్రెటరీ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.





## పోలీస్ స్టేషన్లలో పరిశుభ్రత కార్యక్రమం

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా సోమవారం నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఆయా పోలీస్‌స్టేషన్లలో పరిసరాల పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించినట్లు సీపీ సాయిచైతన్య పేర్కొన్నారు.

ఈ మేరకు ఆయన సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్ పరిధిలో గల అన్ని పోలీస్ స్టేషన్లలో పరిసరాలను పరిశుభ్రం చేయించినట్లు తెలిపారు.

## భవిత కేంద్రాన్ని సందర్శించిన ఎంఈవో

**అక్షరటుడే, బాల్కొండ:** మండలంలోని కిసాన్ నగర్ గ్రామంలో ఉన్న భవిత కేంద్రాన్ని మండల విద్యాశాఖ అధికారి బట్టు రాజేశ్వర్, సర్పంచ్ రామరాజు గౌడ్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు అందిస్తున్న శిక్షణ, ఫిజియోథెరపీ సేవలను పరిశీలించారు. పాఠశాలల్లో ప్రత్యేక అవసరాలు ఉన్న విద్యార్థులకు అందుతున్న విద్యా, శిక్షణ కార్యక్రమాల వివరాలు తెలుసుకున్నారు. భవిత కేంద్రంలో శారీరక దివ్యాంగులైన విద్యార్థులకు ప్రతి సోమవారం, గురువారం వారానికి రెండు రోజులు ఫిజియోథెరపీ సేవలు అందుబాటులో ఉన్నాయని





తెలిపారు. కార్యక్రమంలో ఫిజియోథెరపిస్ట్ అఖిల, ఐఆర్పీ రాజనర్సయ్య, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ నాయకుల ధర్నా



**అక్షరటుడే, కోటగిరి :** ఎన్నికల్లో ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కోటగిరి తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు ఏముల నవీన్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు అనేక హామీలు ఇచ్చారని వాటిలో ఏ ఒకటి కూడా అమలు చేయలేదని అన్నారు. యువతకు ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, వృద్ధాప్య, వితంతు, దివ్యాంగుల పెన్షన్, కల్యాణ లక్ష్మి, రైతు భరోసా, వంటి హామీలు ఇప్పటివరకు అమలు కాలేదని పేర్కొన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతో రైతు భరోసా రాక రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. మండలంలోని దరఖాస్తు చేసుకున్న, వృద్ధులు, వికలాంగులు, ఒంటరి మహిళల పెన్షన్లు ఇప్పటివరకు మంజూరు కాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇచ్చినటువంటి హామీలను వెంటనే నెరవేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో హరి, ఆలపాటి కోనేరు శశాంక్, సీనియర్ నాయకులు పుల్లల మోహన్‌రావు, శ్యామల, నాగెల్లి శ్రీనివాస్, జగదీష్, శ్యాం, మామిడి సాయిలు, ధవులయ్య తదితరులు పాల్గొన్నారు.



## బెల్ట్ షాప్‌లను మూసివేయాలి

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** మండలంలోని వెల్లుట్లలో బెల్టుషాపులను మూసివేయాలని సోమవారం గ్రామ ప్రజలు ఎక్సైజ్ సీఐ షకీర్ అహ్మద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ గ్రామంలో బెల్ట్ షాపుల్లో విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు జరపడం వల్ల నిత్యం గొడవలు అవుతున్నాయని.. యువత పెడదారి పడుతున్నారన్నారు. బెల్ట్ షాప్ నిర్వహిస్తున్న వారిపై చర్యలు తీసుకొవాలన్నారు. కార్యక్రమంలో వెల్లుట్ల గ్రామస్థులు లింగపురం సాయిలు, జక్కుల సంతోష్ కుమార్, పోతుగంటి సాయిలు, కన్నెబోయిన రాజు, బెగారి రవి, కృష్ణ, గౌతమ్, రమేష్, నాగరాజు పాల్గొన్నారు.

## ఆలూర్‌లో డ్రెయినేజీ పనులకు భూమిపూజ




**అక్షరటుడే, ఆర్మూర్:** ఆలూర్ మండలంలో 15వ ఆర్థిక సంఘ నిధులతో డ్రెయినేజీ నిర్మాణ పనులను సర్పంచ్ ముక్కెర విజయ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రతి గ్రామంలో రహదారులు, డ్రెయినేజీలు, తాగునీటి వంటి సదుపాయాలను బలోపేతం చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఆలూర్ గ్రామంలో దశలవారీగా డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపర్చడంతో పాటు ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులను కొనసాగిస్తామన్నారు. ఆర్మూర్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్ రెడ్డి సహకారంతో కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో గంగాధర్, ఉప సర్పంచ్ ఇలేటి పద్మ మోహన్, పంచాయతీ కార్యదర్శి ఉమా, వార్డు సభ్యులు ప్రవీణ్, భోజన్న, సాయిలు, రంజిత్, శిరీష, సంజీవ్, అనుప్రియ, భాస్కర్, నరేష్, లక్షపతి, మౌనిక, సునీల్, మహేష్, రమ్య, అఖిల్, మల్లేష్, కాంగ్రెస్ నాయకులు ములకిడి శ్రీనివాస్ రెడ్డి, నవనీత్, గంగారెడ్డి, చిరంజీవి, బీరయ్య పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేర్చాలి



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను వెంటనే అమలు చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎల్లారెడ్డి తహశీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం వారు అందజేశారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు అనేక హామీలు ఇచ్చి ఇప్పుడు అమలు చేయలేక చతికిలపడిపోయిందన్నారు. రైతు రుణమాఫీ పూర్తి చేయలేదని..రైతు పెట్టుబడి సాయం అందడం లేదన్నారు. కౌలు రైతులకు రైతు భరోసా ఇవ్వడం లేదన్నారు. పెళ్లి కానుకగా మహిళలకు తులం బంగారం మరిచారని పేర్కొన్నారు. నిరుద్యోగులకు భృతి ఇవ్వడం లేదని.. యువతీయువకులు రాజీవ్ యువ వికాసం అమలు చేయట్లేదన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు మర్రి బాలకిషన్, పట్టణ అధ్యక్షులు అగల్ దివిటీ రాజేష్, మండల అధ్యక్షుడు పెద్దెడ్ల నర్సింలు, జనరల్ సెక్రటరీ కుచుల కంటి శంకర్, ఉపాధ్యక్షుడు వంగపల్లి కాశీనాథ్, రమేష్, మాజీ పట్టణ అధ్యక్షుడు కుశలకంటి సతీష్, సీనియర్ నాయకులు సత్యం, యువ నాయకులు ఓలేపు రమేష్ పాల్గొన్నారు.

## ఆరు గ్యారెంటీలను అమలు చేయాలి



**అక్షరటుడే, గాంధారి:** కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని బీజేపీ నాయ కులు డిమాండ్ చేశారు. ఈ మేరకు డిప్యూటీ తహశీల్దార్ లక్ష్మణ్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం బీజేపీ మండల అధ్యక్షుడు మధుసూదన్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తానన్న ఆరు గ్యారెంటీలలో రైతు భరోసా, కల్యాణ లక్ష్మి, వృద్ధులకు రూ.6వేల పెన్షన్, మహిళలకు రూ.2500 పెన్షన్, నిరుద్యోగ భృతి, ఆటో డ్రైవర్లకు ఏడాదికి రూ.12వేలు ఇస్తామని ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి రాంసింగ్, మండల అధ్యక్షుడు హుస్సేన్, బీజేపీ సీనియర్ నాయకులు సీతారాములు, శివయ్య, స్వామి, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.